



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6:22 (బుధవారం)

సహరీ : ఉదయం 5:05 (గురువారం)





ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



గిత్త జయసూర్య




బండి జయరాజు



కాకరవాడ వెంకటస్వామి



విక్టర్



ఎవరికి దక్కేనో..!

- నందికొట్కూరు అభ్యర్థిపై వీడని ఉత్కంఠ
- త్వరలో టీడీపీ రెండో జాబితా
- టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు
- తీవ్ర పోటీ ఆ ఇద్దరి మధ్యే..!

నంద్యాల (ఆంధ్రజ్యోతి)/ నందికొట్కూరు, మార్చి 12:

జిల్లాలోని ఏకైక ఎస్సీ నియోజకవర్గమైన నందికొట్కూరుపైన టీడీపీ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే అధికార వైసీపీ తన అభ్యర్థిని ప్రకటించగా.. టీడీపీ మాత్రం ఆచితూచి అడుగులేస్తోంది. ఎస్సీ సామాజిక వర్గంలోని మాల, మాదిగ సమీకరణాలను అంచనా వేస్తూ ఏ అభ్యర్థి అయితే బాగుంటుందని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. అయితే పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మాత్రం తాను చెప్పిన వారికే టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నాడు. మరోవైపు వైసీపీ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కూడా టికెట్ హామీ ఇస్తే పార్టీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నాడంటూ ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు మరో ఇద్దరు సొంతంగా టికెట్‌ను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థి ఎంపికపై టీడీపీ తర్జనభర్జన పడుతోంది. ఇప్పటికే టీడీపీ,జనసేనలు పొత్తులో భాగం కాగా బీజేపీ కూడా ఆ టీంలోకి చేరిపోయింది. మూడు పార్టీల కలయికతో రాష్ట్రంలో పొత్తు బలోపేతమైంది. ఈ క్రమంలో రెండు, మూడు రోజుల్లో అధికారికంగా మలివిడత అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. రెండో జాబితాలో నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో నోటిఫికేషన్ కూడా వస్తుందన్న ప్రచారం జరుగుతున్న తరుణంలో కూడా నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరన్నది టీడీపీ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అటు టికెట్ ఆశావహుల్లోనూ.. ఇటు నియోజకవర్గ ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. నందికొట్కూరు నియోజకవర్గంలో 20 ఏళ్లుగా అందని ద్రాక్షలా ఉన్న గెలుపు కోసం ఈసారి టీడీపీ గట్టిగానే ప్రయత్నిస్తోంది.

మాండ్ర శివానందరెడ్డి పట్టు

నందికొట్కూరు ఎస్సీ నియోజకవర్గమైనప్పటికీ.. మొదటినుంచీ ఇక్కడ రాజకీయం కాస్త భిన్నంగా ఉంటుంది. ఎస్సీలోని రెండు ప్రధాన ఉపకులాలైన మాల, మాదిగ తమ సంఖ్యా బలం ఎక్కువంటే.. తమది ఎక్కువని, తమ వర్గం వారికి టికెట్ ఇవ్వాలంటూ ఎవరికివారు తమవాదనలు వినిపిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకుందామనే ఆలోచనలో ఉన్న టీడీపీకి.. నందికొట్కూరు అసెంబ్లీ టికెట్‌ను ఎస్సీలోని ఏదో ఒక వర్గానికి టికెట్ ఇచ్చి చేతులు దులుపుకునేందుకు సిద్ధంగా లేదు. గత ఎన్నికల్లో టీడీపీ తరపున మాల వర్గానికి చెందిన బండి జయరాజు పోటీ చేసి ఓడిపోయాడు. కాబట్టి ఈసారి మాదిగ కులస్థులకు అవకాశం ఇస్తే ఎలా ఉంటుందని టీడీపీ యోచిస్తోంది. అయితే ఈ పరిస్థితి వస్తుందని తెలిసే మాండ్ర ముందునుంచి తన చతురతను ప్రదర్శించాడు. చివరి నిమిషంలో టీడీపీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుని, ఏ వర్గానికి టికెట్ కేటాయిస్తుందో తెలియదు? కాబట్టి.. మాల వర్గం నుంచి ఒకరిని, మాదిగ వర్గం నుంచి ఒకరిని చాలాకాలం కిందటి నుంచి టికెట్ రేసులో ఉంచాడు. టికెట్‌ను మాలలకు ఇచ్చే అవకాశం ఉంటే బండి జయరాజు, మాదిగలకు ఇద్దామనుకుంటే గిత్తా జయసూర్యకు ఇవ్వాలంటూ తన ప్రతిపాదనను టీడీపీ అధిష్ఠానం ముందుంచారు. మాండ్ర సూచించిన వారిలో ఎవరు ప్రభావం చూపగలరన్న దానిపైన టీడీపీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి రాలేకపోతోంది.

ఎమ్మెల్యే ఆర్థర్, విక్టర్‌లు కూడా..

సిట్టింగ్ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ టీడీపీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు రెండు నెలల నుంచి ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్న ఆర్థర్‌కు వచ్చే ఎన్నికల్లో పోటీచేసేందుకు వైసీపీ టికెట్‌ను నిరాకరించింది. ఆయన స్థానంలో కడప జిల్లాకు చెందిన డాక్టర్ ధారా సుధీర్‌ను తీసుకురావడంతో ఆర్థర్ అలిగాడు. టికెట్ లేకుండా వైసీపీలో కొనసాగడమెందుకనే భావనతో టీడీపీలోకి వచ్చేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. టికెట్ ఇస్తానని టీడీపీ అధిష్ఠానం హామీ ఇస్తేనే పార్టీలో చేరతానని మెలిక కూడా పెట్టినట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థిగా ఆర్థర్ అయితే ఎలా ఉంటుందంటూ ఆ పార్టీ ఇటీవల ఫోన్ సర్వేను కూడా నిర్వహించింది. ఆ తర్వాత టీడీపీ నుంచి గానీ, ఆర్థర్ నుంచి గానీ ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం. నందికొట్కూరు అసెంబ్లీ సీటు ఇంకా ఎవరికి ఖరారు కాలేదు కాబట్టి ఆ టికెట్ తనకే వచ్చేలా చూడాలంటూ ఎమ్మెల్యే ఆర్థర్ తను సర్వీసులో ఉన్నపుడు పరిచయమున్న ఓ మాజీ డీజీపీ సహకారంతో టీడీపీ హైకమాండ్‌కు కబురు పంపినట్లు తెలుస్తోంది. ఆర్థర్ ప్రయత్నాలు ఇలా ఉంటే.. ఆయనకు అత్యంత సన్నిహితుడైన తమ్మెడపల్లి విక్టర్ కూడా టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నాడు. మొన్నటి వరకు వైసీపీలో ఉన్న విక్టర్ ఇటీవలే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీలో చేరాడు. విక్టర్ మొదట టీడీపీలోనే ఉన్నాడు. 2014 ఎన్నికల సమయంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేసినా, టీడీపీ చివరి క్షణంలో లబ్బి వెంకటస్వామికి టిక్కెట్ ఇవ్వడంతో విక్టర్ మిన్నకుండిపోయాడు. ఇక 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ తరపున టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేసినా నిరాశే మిగిలింది. ఈ సారైనా టీడీపీ తనకు టిక్కెట్ ఇస్తుందని గంపెడాశతో విక్టర్ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఇద్దరు స్నేహితులు కలిసి..

నందికొట్కూరు పరిస్థితులను, టీడీపీ ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి, మాదిగ వర్గానికి చెందిన కాకరవాడ చిన్న వెంకటస్వామి తప ప్రయత్నాలను సాగిస్తున్నాడు. ఆయనకు తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాయకుడు మహేశ్ నాయుడు మద్దతు తెలుపుతున్నాడు. వీరిద్దరు రాయలసీమ యూనియవర్సిటీలో ఉన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. యూనివర్సిటీలో చదువుకునే సమయంలో పలు ఉద్యమాల్లో పాలుపంచుకున్న అనుభవం కూడా ఉంది. ఇటు నారా లోకేశ్‌తో టచ్‌లో ఉంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితుడైన ఓ వ్యక్తి నుంచి మహేశ్ నాయుడు, కాకరవాడ లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం.

టీడీపీకి కలిసిరానున్న 'వ్యతిరేకత'

నియోజకవర్గంలో 20 ఏళ్లుగా టీడీపీ అభ్యర్థులు గెలిచిన దాఖలాలు లేవు. అంతకుమునుపు 1994, 1999 ఎన్నికల్లో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వరుసగా రెండుసార్లు టీడీపీ నుంచి గెలిచారు. తర్వాత టీడీపీకి అక్కడ విజయం అందని ద్రాక్షలా మారింది. కానీ ఈసారి వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, నందికొట్కూరు వైసీపీ కీలక నాయకులపై ప్రజల్లో నమ్మకం కోల్పోవడం లాంటి సమీకరణాల నేపథ్యంలో టీడీపీ గెలుపుపై ఆశలు పెట్టుకుంది. ప్రస్తుతం జగన్‌పై వ్యతిరేకత బాగా ఉంది. మరోవైపు టీడీపీ హవా కొనసాగుతోంది. ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిందేమీ లేకపోవడంతో ప్రజలు వైసీపీని ఈసడించుకుంటున్నారు. దీనికి తోడు వైసీపీ అరాచకాలు, అక్రమాలు పెచ్చుమీరిపోతుండటంతో ప్రభుత్వం మీద బాగా వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. పైగా ఈ సారి నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థిగా వైసీపీ కడప వ్యక్తిని దిగుమతి చేసింది. స్థానికేతరుడికి ఓటు వేసి గెలిపిస్తే.. తమ పనుల కోసం ప్రతిసారీ కడపకు వెళ్లాలా? అన్న ప్రశ్న నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తమవుతోంది. అనుకూల పవనాలకు తోడు, స్థానికుడు కాదన్న భావన నందికొట్కూరు నియోజకవర్గ ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్న తరుణంలో టీడీపీ తరుపున బి-ఫామ్ తీసుకున్న వ్యక్తి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు.

వైద్యంపై డీఎంహెచ్‌ఓ సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల క్రైం, మార్చి 12: జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.వెంకటరమణ మంగళవారం నంద్యాల సర్వజన ఆస్పత్రిలోని మాతా శిశు సంక్షేమ బ్లాక్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. మాతా శిశు సంరక్షణపై హెచ్‌ఎంఐఎస్ పోర్టల్, సీఎస్‌ఎస్‌ఎం పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లను పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ వెంకటరమణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యసేవల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, డయాబెటిక్, క్యాన్సర్ తదితర జబ్బులను వెంటనే స్ర్కీనింగ్ నిర్వహించి తక్షణమే చికిత్స అందించాలన్నారు. టీబీ (క్షయ) ముక్తభారత్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్ర్కీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతారావునాయక్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ జగదీశ్‌చంద్రారెడ్డి, ఎస్‌ఓ సుజాత, నజీం, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధి నిర్మాణాలు జాతికి అంకితం

వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ



వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

నంద్యాల (కల్చరల్, నూనెపల్లె), మార్చి 12: దేశ వ్యాప్తంగా 85వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రైల్వే అభివృద్ధి నిర్మాణాలను ప్రధాని మోదీ మంగళవారం జాతికి అంకితం చేశారు. దీని కోసం దేశంలోని పలు రైల్వే స్టేషన్లలో ప్రజాప్రతినిధుల సమక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పలు ప్రాజెక్టులు, పలు కొత్త రైళ్లు, ఒక స్టేషన్, కోచ్ రెస్టారెంట్లను జాతికి అంకితం చేశారు. నంద్యాల రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారి ఏడీయంఈ రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రైల్వే యూజర్ కమిటీ జోన్ స్థాయి సభ్యులు జుబేర్ బాషా, బీజేపీ కేంద్ర కమిటీ సభ్యుడు మేడా మురళీధర్ తదితరులు హాజరై ప్రధానమంత్రి కార్య క్రమాన్ని వీక్షించారు. రైల్వే నోడల్ ఆఫీసర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఇది వరకే పాదచారుల వంతెన ఏర్పాటు చేశామని, దీనితో పాటు లిఫ్ట్ ఏర్పాటు చేయడం, ఆధునికీకరణలో భాగంగా 12.3 మీటర్ల వెడల్పుతో కొత్త వంతెన, ఎస్కవేటర్, వెయిటింగ్ హాల్స్ కోచ్ రెస్టారెంట్, తదితర సదుపా యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కంట్రోలర్ రవి ప్రకాష్, రైల్వే సిబ్బంది, రైల్వే ప్రయాణికులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాండ్ర



అధినేత చంద్రబాబును కలిసిన మాండ్ర దంపతులు, టీడీపీ నాయకులు

నందికొట్కూరు, మార్చి 12: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మంగళవారం అమరావతిలో కలిశారు. ఆయనతో పాటు సతీమణి ఉమాదేవి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు కూడా చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ, నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై అధినేతతో చర్చించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లను ప్రకటిస్తామని, అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని మాండ్ర శివానందరెడ్డి దంపతులకు బాబు సూచించారు. చంద్రబాబును కలిసిన వారిలో నందికొట్కూరు మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి, పలచాని మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

సర్పంచ్ భర్తంటే ఏమనుకున్నారు?

- మంచినీటి బోరు నీళ్లు పొలానికి మళ్లింపు
- రెండు నెలలుగా సాగుతున్న నిర్వాకం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని గ్రామ కార్యదర్శి





అబ్బీపురం సచివాలయం

నంద్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆయన అధికార పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచు భర్త. ఇంతకంటే ఇంకేం కావాలి? ఏమైనా చేయవచ్చని అనుకున్నాడు. ఏకంగా గ్రామాన్ని ఆదుకొనే బోరు నీటిని తన పొలానికి వాడుకుంటున్నాడు. రెండు నెలలుగా ఈ వ్యవహారం నడుస్తున్నది. గ్రామ ప్రజలు అధికారుల దృష్టికి తీసికెళుతున్నా సదరు సర్పంచ్ భర్తను ఇప్పటికి అడ్డుకోగలిగారు. మహానంది మండలం అబ్బీపురంలో ఇది జరిగింది. గ్రామానికి మంచినీటి సరఫరా చేసేందుకు గతంలో గ్రామంలోని మారెమ్మ గుడి వద్ద బోరు వేశారు. దీని నుంచి గ్రామం మొత్తానికి మంచినీరు సరఫరా చేసేవారు. శరభారెడ్డి మూడెకరాల్లో అరటి తోటను సాగు చేస్తున్నాడు. ఆయన తోటలోని బోరు నీరు అడుగంటడంతో తోట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయన గ్రామానికి మంచినీరు సరఫరా చేసే బోరుకు పైపును తగిలించి నీటిని తన తోటకు మళ్లించుకోవడం మొదలు పెట్టాడు. దీని వల్ల రెండు నెలల నుంచి అబ్బీపురం గ్రామ ప్రజలు తాగునీటి కి తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆయనను అడ్డుకోడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సాహసించలేదు. చివరికి ఈ సమస్య కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఎట్టకేలకు బోరుకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ను శరభారెడ్డి సోమవారం రాత్రి తొలగించాడు. వైసీపీ సర్పంచు భర్తకు అధికారులు భయపడి తమను రెండు నెలలు ఇబ్బందులు పాలు చేశారని, ఎంత అధికార పార్టీ అయితే మాత్రం ఇంతలా వారి అడుగులకు మడుగులు వత్తాలా? అబ్బీపురం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నంద్యాలలో టీడీపీ జెండా ఎగురవేస్తాం

- మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు
- స్పష్టం చేసిన టీడీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఫరూఖ్, భూమా, మల్లెల, ఏవీ

నంద్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని నంద్యాల టీడీపీ అభ్యర్థి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిలు స్పష్టం చేశారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఫరూక్, భూమా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఏవీ సుబ్బారెడ్డిలు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అందరం కలిసి నియోజకవర్గం ప్రచారంలో పాల్గొంటామని, మరో రెండు మూడు రోజుల్లో కార్యకర్తలతో కూడా సమావేశం ఏర్పాటు చేసి మిగతా విషయాలు తెలియజేస్తామన్నారు. ఎన్‌ఎండీ ఫరూఖ్ మాట్లాడుతూ పార్టీలో ఉన్నపుడు పార్టీ గెలుపు కోసం పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లు స్పష్టం చేశారని తెలిపారు. భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కొత్తగా చెప్పేదేమీ లేదని, రెండు రోజుల కిందట లోకేశ్‌ను కలిసిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. తమలో ఎవరికీ ఎలాంటి విభేదాలు లేవని, తమకు సంబంధించి వస్తున్నవి కేవలం ప్రచారాలేనని అన్నారు. నంద్యాలలో టీడీపీ అభ్యర్థి ఫరూక్ గెలుపునకు సమష్టిగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

పట్టాభి 'రాఘవుడు'



- ఘనంగా రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం
- బంగారు సింహాసనంపై స్వామివారి పాదుకలు
- భక్తులతో కిక్కిరిసిన మంత్రాలయం
- కన్నుల పండువగా స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం, మార్చి 12: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురు వైభోత్సవాల్లో రెండో రోజు మంగళవారం రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఊంజల మండపంలో బంగారు సింహాసనంపై రాఘవేంద్రస్వామి మూల బంగా రు పాదుకలకు ముత్యాలు, బంగారు నాణేలు, వెండి నాణేలు, వజ్రవైఢూర్యాలు, వివిధ రకాల పుష్పాలతో అభిషేకాలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. బంగా రు పాదుకలను బంగారురథంపై అధిష్ఠించి వేద పండి తుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. మూల రాములకు, జయ రాములకు, దిగ్విజయరాములకు పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేసి బంగారు నాణేలతో అభిషేకించి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 పంచాంగాన్ని పీఠాధిపతి ఆవిష్కరించారు. గురువైభ వోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో చెన్నైలోని కోయంబత్తూరు చెందిన మహిమ శ్రీధర్‌లచే భరతనాట్యం, యోగశ్రీల ఆధ్యాత్మిక భక్తిగీలాపన ఆకట్టుకున్నాయి.


బంగారు రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

ప్రముఖులకు అవార్డుల ప్రదానం


సోమిశెట్టికి అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాల్లో భాగంగా రెండో రోజు పట్టాభిషేక మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు అవార్డులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్నవారిలో ఎస్పీ జి. కృష్ణకాంత్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్ణాటక దేవదాయశాఖ కమిషనర్ బసవరాజేంద్ర, కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఎస్.నాగరాజు అనసదొడ్డి, ఉడిపి ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఆస్ట్రోమోహన్, ప్రముఖ సామాజికవేత్త ఆర్ఎన్ రవికుమార్, దేవరాయసముద్ర, బెంగుళూరు చెందిన ప్రముఖ అడ్వకేట్ ఫణిరాజ్ కశ్యప్‌లకు అవార్డులను అందజేశారు. అవార్డుతో పాటు నగదు, వెండిపళ్లెం, శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌహతి హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ శ్రీధర్‌రావు, బెంగుళూరు ప్రముఖ పారిశ్రామికవేత్త కిరణ్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, మంత్రాలయం, కోసిగి సీఐలు ఎరిషావలి, ప్రసాద్, ఎస్ఐ గోపీనాథ్, ఏఎస్ఐ ఆనందరెడ్డి, ఈఈ సురేష్ కోనాపూర్ తదితరులు పాల్గొన్నారు.


బంగారు మండపంలో మూలరాములకు పూజలు


ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు


బంగారు రథంపై పీఠాధిపతి, శ్రీమఠం అధికారులు



ఎస్పీకి అవార్డును ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయంలో వందేభారత్ రైలు ప్రారంభం

మంత్రాలయం, మార్చి 12: మంత్రాలయం మండలంలోని తుంగభద్ర (మంత్రాలయం రోడ్డు) రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం వందేభారత్ రైలును బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, స్టేషన్ మాస్టర్ కాశీనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం కలబుర్గి నుంచి మంత్రాలయం మీదుగా బెంగుళూరుకు వెళ్తున్న వందేభారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, నరేంద్ర, నియోజక కోకన్వీనర్ చిన్న ఈరన్న, మండల అధ్యక్షుడడు శ్రీకృష్ణ, పురుషోత్తంగౌడు, బంగారయ్య, రాఘవేంద్ర కులకర్ణి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.


తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ

మల్లన్న హుండీ ఆదాయం రూ. 5.16 కోట్లు

శ్రీశైలం, మార్చి 12: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.5,08,66,006, అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.8,18,411 రాగా మొత్తం రూ.5,16,84,417 నగదు రూపంలో రాబడిగా లభించింది. ఆలయ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 13 రోజులలో, అన్నదానం హుండీ ఆదాయాన్ని డిసెంబరు 13వ తేదీ నుంచి మార్చి 11వ తేదీ వరకు సమర్పించారు. నగదుతో పాటు 122 గ్రాముల 400 మిల్లీగ్రాముల బంగారు, 5.90 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 240 యూఎస్ఏ డాలర్లు, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూఏఈ దిర్హామ్స్, 25 సింగపూర్ డాలర్లు మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ పెద్దిరాజు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆర్.రమణమ్మ, అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.


మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పేదల ఇళ్లకు ఉచిత సౌర విద్యుత్

- రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్ల ఏర్పాటు
- అమలులోకి తెచ్చిన కేంద్రం
- దరఖాస్తుకు విధి విధానాలు జారీ



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో విద్యుత్ బిల్లులను భారీగా పెంచడంతో వినియోగదారులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ భారాన్ని తట్టుకోలేక ఇదేమి ఖర్మరా.. బాబోయ్ అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఈ భారాన్ని పేదలు తగ్గించుకునేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల సౌర విద్యుత్ పథకాన్ని అమలులోకి తెచ్చింది. పేద, మధ్యతరగతి నివాస గృహాల్లో రాయితీతో సోలార్ రూఫ్ ట్యాప్ ప్యానెళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని అమలులోకి తెచ్చింది. అధిక విద్యుత్‌తో వివిధ రూపాల్లో చార్జీల భారంతో అవస్థలు పడుతున్న ఈ పథకం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట కలగనుంది. దరఖాస్తులను నేషనల్ పోర్టల్ https://pmsuryaghar.gov.inలో సమర్పించాల్సి ఉంటుందని కలెక్టరేట్‌లోని నెట్‌క్యాప్ అధికార వర్గాలు తెలిపాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆరు నెలలకు తక్కువ కాకుండా విద్యుత్ బిల్లు ప్రతిని దరఖాస్తుకు జత చేయాలి. అలాగే వ్యక్తిగత నివాస సమూహ గృహ కామన్ సర్వీసులకు ఇది వర్తిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక దరఖాస్తుదారులు నెట్ మీటరు కోసం అప్లయ్ చేసుకోవాలి. నెట్ మీటరును అమర్చుకున్న తర్వాత దరఖాస్తుదారులు పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. కేంద్రప్రభుత్వం వినియోగదారుల దరఖాస్తును పరిశీలించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ చేసిన తర్వాత సబ్సిడీ 30 రోజుల్లోగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చెల్లిస్తారు. కిలో వాట్ సోలార్ రూఫ్‌ట్యాప్‌ను అమర్చాడానికి ఇంటి పైకప్పు మీద 10 చదరపు మీటర్ల స్థలం ఉండాలి. ఇంటి పైకప్పు పటిష్టతపై ధ్రువీకరణ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది.

ఇవి ఉపయోగాలు

కిలో వాట్ సోలార్ రూఫ్‌ట్యాప్ ప్యానెల్ ఏర్పాటు వల్ల దాదాపు 125 యూనిట్లను ఆ ప్యానెల్ ద్వారా ఉత్పత్తి అవుతుంది. దీంతో వినియోగదారులు డిస్కం నుంచి భారీ స్థాయిలో కరెంటు చార్జీ భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. కనీస విద్యుత్ బిల్లులను పొందుతారు.

త్రిశంకు స్వర్గంలో నిరుద్యోగులు

- యువతను మోసగించిన జగన్
- నిరుద్యోగ గర్జనసభలో మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత

కల్లూరు, మార్చి 12: గత ఎన్నికల్లో యువత ఓట్లతో గద్దెనెక్కిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారి జీవితాలను త్రిశంకుస్వర్గంలోకి నెట్టాడని మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాయలసీమ నిరుద్యోగ గర్జనసభ జరిగింది. ఈ సభకు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, గౌరుచరిత, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తానన్న జాబ్ క్యాలెండర్ మాట ఏమైందని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ అంటూ మోసం చేసిన సీఎం జగన్ తీరా ఎన్నికల ముందు నామమాత్రపు పోస్టులను ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, నిరుద్యోగులకు అన్నివిధాల అండగా ఉంటామని ఆమె భరోసానిచ్చారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఓర్వకల్లులో టీడీపీ ప్రభుత్వం సోలార్‌పరిశ్రమ, జయరాజ్‌ఇస్పాత్‌య స్టీల్‌ప్లాంటు, డీఆర్డీఓ, ఎయిర్‌పోర్టులను స్థాపిస్తే పాణ్యం వైసీపీ ముఖ్యనేతలు యాజమాన్యాలను వేధిస్తూ దోచుకుతింటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగముని జేఏసీ నేతలు అయ్యస్వామి, కోనేటి వెంకటేశ్వర్లు, అంజి, రవీంద్రనాథ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.


రాయలసీమ నిరుద్యోగ గర్జనసభలో మాట్లాడుతున్న గౌరుచరిత

రోగుల భోజనాన్ని పర్యవేక్షించాలి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 12: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు అందుతున్న భోజనాన్ని సెక్యూరిటీ, శానిటేషన్‌లపై ఆయా హెచ్‌వోడీలు పర్యవేక్షించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి అన్నారు. మంగళవారం ధన్వంతరి హాలులోని ఆరోగ్యశ్రీ, ఈ హాస్పిటల్స్‌పై హెచ్‌వోడీలతో ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. అసలు రోగులకు ఇచ్చే డైట్ నాణ్యత ఎలా ఉంది..? ఎం పెడుతున్నారో.. ఎప్పుడైనా మీరు పరిశీలించారా..? అని ప్రశ్నించారు. హై ప్రొటీన్ డైట్‌కు, నార్మల్ డైట్‌కు ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందో తెలుసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

నెలవారి మరణాలపై సమీక్ష : కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ హాలులో నెలవారి మరణాలపై సమీక్ష జరిగింది. మెడికల్, పీడియాట్రిక్ డిపార్టుమెంట్‌లకు సంబంధించిన రెండు కేసులపై ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష చేశారు. మెడిసిన్ విభాగం నిర్వహించిన ప్రజెంటేషన్‌లో కేషీట్ సరిగ్గా నమోదు చేయకపోవడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ అసహనం వ్యక్తం చేశారు. సమీక్షలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెట్ ప్రభాకర్ రెడ్డి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ: కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 12: పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లాలో 43 పోలింగ్ కేంద్రాలకు లొకేషన్ మార్పు, 107 పోలింగ్ కేంద్రాలకు పేరు మార్పు జరిగిందని కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. మంగళవారం పోలింగ్ కేంద్రాల మార్పు, జర్నలిస్టు హౌసింగ్ స్కీం అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా లొకేషన్ మార్పుకు సంబంధించి 43, పేరు మార్పుకు సంబంధించి 107, యాగ్జిలరీ పోలింగ్ కేంద్రాలు 18 కోసం ప్రతిపాదనలు పంపించామని అన్నారు. పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలియక ఓటు వేయలేదనే పరిస్థితి రాకూడదన్నారు. ఏ పోలింగ్ కేంద్రాన్ని ఎక్కడ నుంచి ఎక్కడకు మార్చామనేది ఆ ప్రాంతాలలో ఒక వారం పాటు స్పెషల్ క్యాంపెయిన్ చేయాలని నాన్నారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి అన్ని మండలాల తహసీల్దార్లు, డివిజినల్ అధికారులు, ఆయా మండలాలు, నియోజకవర్గాల కేంద్రాల్లో గుర్తించిన భూమి బేసిక్ వాల్యూ ప్రపోజల్స్ మంగళవారంలోపు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో గార్గేయపురం స్థలానికి ప్రభుత్వం నుండి త్వరలోనే స్పష్టత రావచ్చన్నారు. స్పష్టత రాగానే పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం

- మహానందీశ్వరుడికి ఆదాయం రూ.58,28,276

మహానంది, మార్చి 12: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమష్టి కృషితో దిగ్విజయంగా పూర్తి చేసామని మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ..58,28,276 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది జరిగిన ఉత్సవాల కంటే రూ. 3 లక్షలకు పైగా ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు ఈవో చెప్పారు. దర్శనానికి వచ్చే భక్తులు స్వచ్ఛందంగా సేవా టిక్కెట్లు కొనుగోలు చేసి వెళ్ళడం ద్వారానే ఇంత ఆదాయం వచ్చిందన్నారు. ప్రసాదాల విక్రయాలు అంతగా జరగలేదన్నారు. పార్కింగ్ స్థలంలో విద్యుత్ ఏర్పాట్లపై జరిగిన పొరబాట్లు కొన్ని తన దృష్టికి వచ్చాయని, మరోసారి ఇలా జరగకుండా చేస్తామన్నారు. మంగళవారం ఆలయంలో యథావిధిగా గర్భాలయ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగ సంఘాల ఆధిపత్య పోరు

- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ విషయంలో వివాదం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 12: కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో రెండు ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగులు 167 మంది ఉన్నారు. వీరందరిని రెగ్యులరైజేషన్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన 129 మంది సర్వీసును రెగ్యులర్ చేస్తూ డీఎంహెచ్‌వో ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. అయితే కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో ఘనత మాదంటే మాదని వాదించుకొనే క్రమంలో రెండు సంఘాలు వాట్సాప్‌లో దుమ్మెత్తి పోసుకున్నాయి. డీఎంహెచ్‌వోపై ఒత్తిడి తెచ్చి సర్క్యులర్ విడుదల చేయించారని ఓ యూనియన్ డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇచ్చారని మరో యూనియన్ అంటుంది. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ జాయినింగ్ రిపోర్టులు వైద్యాధికారులు తీసుకోవడం లేదని ఓ సంఘం ఆరోపిస్తున్నది. ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ ప్రక్రియ అమలవుతుందని మరో సంఘం అంది. దీనిపై డీఎంహెచ్‌వో డా.బి. రామగిడ్డయ్య ఏప్రిల్ 1 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా త్వరలో రెగ్యులర్ ఆర్డర్స్ ఇవ్వనుంది. వాట్సాప్ అంశం తన దృష్టికి రాలేదని, ఇది రెండు యూనియన్ల మధ్య జరిగినట్లుగా ఉందని తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 942 మంది విద్యార్థులు గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 12: జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షల్లో మంగళవారం 942 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎస్వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. 23,974 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 942 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

గుంటూరులో వలస కూలీ మృతి

కౌతాళం, మార్చి 12: స్వగ్రామంలో సరైన పనులులేక, పంటలు పండక పొట్టకూటి కోసం గుంటూరుకు వెళ్లిన వలస కూలీ అక్కడ పనులు చేస్తూ వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. దీంతో కౌతాళంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలోని పింజారి వీధికి చెందిన కంబళదిన్నె ఉసేన్‌సాబ్(54) గత 45 రోజుల క్రితం పొట్ట చేతపట్టుకుని కుటుంబ పోషణ కోసం గుంటూరులో మిరప కోత పనులకు వెళ్లాడు. అక్కడ వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వైద్యం చేయించినా కోలుకోలేక మంగళవారం మృత్యువాత పడ్డాడు. మృతునికి నలుగురు ఆడపిల్లలు సంతానం. మృతదేహాన్ని గుంటూరు నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు బంధువులు తెలిపారు.

నంద్యాల


నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ

గోస్పాడు, మార్చి 12: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బీవీ నగర్‌లో మంగళవారం శంఖారావం కిట్లను పంపిణీ చేసిన ఫరూక్ ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాలను గ్రామస్థులకు వివరించారు. ఫరూక్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో గ్రామాలను అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలలో ఒక్క అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకం కనబడటం లేదన్నారు. పజలు ఒక్కసారి అని నమ్మి మోసపోయారని, మళ్లీ అదే తప్పు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, గంగుల వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: టీడీపీ అధికారంలోకి వస్తే సుబ్బారెడ్డి పాలెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని టీడీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ హామీ ఇచ్చారు. సుబ్బారెడ్డి పాలెం గ్రామంలో పార్టీ నాయకులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. గ్రామాభివృద్ధి గురించి చర్చించారు. అనంతరం టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.

గడివేముల, మార్చి 12: రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ రావాలని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరితారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కరిమద్దెల గ్రామంలో మంగళవారం ఆమె శంఖారావం కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కరిమద్దెల గ్రామంలో గౌరుచరితకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి హారతులు పట్టారు. అనంతరం గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర సరుకులు ఆకాశన్నంటాయని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని అన్నారు. ధాన్యం అమ్ముకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని అన్నారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చంద్రబాబు బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారని అన్నారు. టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌పై బీసీలు హర్షం



గోస్పాడు: పథకాల గురించి వివరిస్తున్న ఫరూక్

వ్యక్తం చేస్తున్నారని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యంరెడ్డి, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఏ రఫిక్, మురళీమోహన్‌రెడ్డి, గని హర్ష, గిరిబాబు, శ్రీనివాసులు, రమణయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: టీడీపీ, జనసేన పార్టీలు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మేనిఫెస్టోలో భాగమైన బాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు టీడీపీ శ్రేణులు బాధ్యతగా వ్యవహరించాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు టీడీపీ కార్యాలయలో క్లస్టర్-4 పరిధిలోని కురుకుంద, కొట్టాలచెరువు, వడ్లరామాపురం, కరివేన, కొత్తరామాపురం, నల్లకాల్వ, బాపనంతాపురం గ్రామాల బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం బూత్ కన్వీనర్లకు బాబు సూపర్ సిక్స్ కిట్లను పంపిణీ చేశారు. నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, మల్లికార్జునరెడ్డి, శివశంకరశర్మ, రవీంద్రబాబు, లింగస్వామి, ఫక్రుద్దీన్, వేణుగోపాల్ ఆచారీ, శరత్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు రూరల్: టీడీపీ ప్రవేశ పెట్టబోయే పథకాలతోనే అన్ని వర్గాలకు సమన్యాయం చేకూరుతుందని టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి శాకమూరి గిరిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తరామాపురం గ్రామంలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు చంద్రుడు, బొట్టు మురళివడ్లమూడి ప్రసాద్, లక్ష్మిరెడ్డి, రాజు, మద్దెల శ్రీనివాసులు,



కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత



మాట్లాడుతున్న బన్నూరు రామలింగారెడ్డి

బొట్టు ప్రసాద్, శ్రీను, కక్కడు, భాస్కర్, చిరంజీవి, ఆంజనేయులు, రాముడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మహానంది: వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని తెలుగు యువత నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ కార్యదర్శి చింతం క్రాంతికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మహానంది మండలం గోపవరం గ్రామంలో టీడీపీ నాయకులు శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పగిడి కుమార్, కసెట్టి శ్రీను, భాష్యం రాముడు, మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు సురేష్‌రెడ్డి, బుగ్గరాముడు, జాకీర్ అన్నారు. మంగళవారం సంతజూటూరు, బండిఆత్మకూరు, బరకల కాలనీలలో శంఖారావం కార్యక్రమం నిర్వహించి కిట్లను అందజేశారు. మహేశ్, శంకర్, జంబులు, మహేశ్వరరెడ్డి, పక్కీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

నంద్యాల (కల్చరల్), మార్చి 12: నంద్యాల జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మంగళవారం 250 రంజాన్ కిట్లను పంపిణీ చేసినట్లు నంద్యాల శాఖ అధ్యక్షుడు అబ్దుల్ సమద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు జకరియా, షోయబ్ జమా, ముస్తఫా, సలీం, ఫయాజ్, యూనస్, అఫ్రోజ్, దాదాపీర్ తదితరు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం'



బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

నంద్యాల టౌన్, మార్చి 12: క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు శారీరక దృఢత్వం పొంది ఆరోగ్యంగా ఉంటారని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా శాఖ కార్యదర్శి కె.నాగేంద్రప్ప అన్నారు. మంగళవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఎన్‌జీవో కాలనీలోని గురురాజా పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు జరిగాయి. పోటీలను గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రారంభించారు. నాగేంద్రప్ప మాట్లాడుతూ విధి నిర్వహణలో మహిళా ఉద్యోగులు పురుషుల కంటే ఎక్కువగా మానసిక ఒత్తిడికి గురి కావడం సహజమని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారిలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు బుధవారం ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఆర్.ప్రభావతమ్మ, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సంఘం నాయకులు శ్రీనివాసులు, సునీల్‌కుమార్, తిరుపాలయ్య, దిబ్బన్న, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 12: సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ కె.శ్రీనివాసులు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఆర్వో పద్మజ, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 14వ తేదీ బనగానపల్లె పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అప్పగించిన పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. హెలి ప్యాడ్ నుంచి సభావేదిక వరకు పారిశుధ్య పనులు, దారికి అడ్డంగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని డీపీవోను, బేతంచెర్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆర్అండ్‌బీ, అగ్నిమాపక, విద్యుత్ అధికారులు తమ తమకు అప్పగించిన పనులను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. అప్పగించిన పనులను ఎలాంటి లోపాలు లేకుండా బాధ్యతయుతంగా చేపట్టాలన్నారు.

జొన్నల కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేసుకోండి: జేసీ



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

నంద్యాల (కల్చరల్), మార్చి 12: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో ప్రభుత్వం అనుమతి రాగానే జొన్నలు కొనుగోలుకు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మార్క్‌ఫెడ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్క్‌ఫెడ్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా కండక్టర్లకు బహుమతి ప్రదానం

ఆత్మకూరు, మార్చి 12: అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఇద్దరు మహిళా కండెక్టర్లకు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించాయి. ఆత్మకూరు డిపోలో పనిచేస్తున్న ముర్తుజాబీ, సుబ్బలక్ష్మి అనే మహిళా కండెక్టర్లు అత్యధిక ఆదాయం తీసుకురావడంతో వారికి మంగళవారం నంద్యాల జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి రజియా సుల్తాన్ నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డిపో మేనేజర్ మహేంద్రుడు మాట్లాడుతూ.. తమ డిపో పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా కండెక్టర్లకు జిల్లా స్థాయిలో గుర్తింపురావడం అభినందనీయమని అన్నారు. ఇదేస్ఫూర్తితో డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండెక్టర్లుగా విధుల్లో రాణించాలని ఆకాంక్షించారు.

టీడీపీ నాయకుల నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పగిడ్యాల, మార్చి 12: పగిడ్యాల గ్రామానికి చెందిన పగడం పెద్ద బజారు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజర్ గిత్త జయసూర్య మంగళవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వాసురెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సుంకన్న తదితరులు ఉన్నారు.

సాయుధ బలగాల కవాతు

నంద్యాల క్రైం, మార్చి 12: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున మంగళవారం నంద్యాల త్రీ టౌన్ పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బీఎస్ఎఫ్ సాయుధ బలగాలు పరిశీలించాయి. దేవనగర్, వీసీకాలనీ, పార్క్‌రోడ్, నాగులకట్ట, బీసీ హాస్టల్, చైతన్యస్కూల్ తదితర ప్రాంతాల్లో త్రీ టౌన్ సీఐ నరసింహులు ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ అధికారులు, 60 మంది సాయుధ బలగాలు, త్రీ టౌన్ పోలీసులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా చూడటమే తమ లక్ష్యమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహించామని చెప్పారు. అనంతరం దేవనగర్, వీసీ కాలనీలలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఎస్పీని కలిసిన బీఎస్ఎఫ్ అధికారులు

నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో బీఎస్ఎఫ్ అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ బీఎస్ఎఫ్ అధికారులకు జిల్లా భౌగోళిక స్వరూపాన్ని, జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలు తెలుపుతూ అక్కడి పరిస్థితులను వారికి వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడటంతోపాటు శాంతిభద్రతలను కాపాడటంలో పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం బీఎస్ఎఫ్ అధికారులు, సాయుధ బలగాలకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్)చంద్రబాబు, బీఎస్ఎఫ్ ఎస్పీ శ్యామ్, అడిషనల్ ఎస్పీ నీరజ్ పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. మంగళవారం పాములపాడు పోలీస్ స్టేషన్ నుంచి ఆత్మకూరు సీఐ నాగభూషణం, కొత్తపల్లి, వెలుగోడు ఎస్ఐలు వరప్రసాద్, భూపాలుడు సాయుధ బలగాలతో బస్టాండు మీదుగా గ్రామంలో ప్రధాన రహదారులు, బీసీ, ఎస్సీ కాలనీలలో కవాతు



పాములపాడులో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ర్యాలీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆత్మకూరు పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఫంగజ్ కుమార్ నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పాతబస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, గౌడ్‌సెంటర్, కేజీరోడ్డు, పాతబస్టాండ్, కొత్తపేట, పెద్దబజారు, గాంధీపార్క్, తోటగేరి, నేతాజీనగర్ మీదుగా పాతబస్టాండ్ వరకు బీఎస్ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో ఆత్మకూరు రూరల్, అర్బన్ సీఐలు నాగభూషణ్, లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రజలందరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు మేమున్నామంటూ సాయుధ బలగాలు ప్రజలకు భరోసా ఇచ్చేందుకు అన్ని ప్రాంతాల్లో కవాతు ద్వారా పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

వైసీపీ ఇన్‌చార్జి వ్యాఖ్యలపై కుల సంఘాల ఆగ్రహం

● దార సుధీర్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నందికొట్కూరు, మార్చి 12: నందికొట్కూరు మాలల నియోజకవర్గమని, గత రెండు సార్లు మాలలే గెలిచారని.. మూడోసారి కూడా గెలుపు తమదేనని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ చేసిన వ్యాఖ్యలు వివాదస్పదంగా మారాయి. ఆయన చేసిన వ్యాఖ్యలపై ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వేరువేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు మాట్లాడుతూ ఎస్సీ నియోజకవర్గంలో గొడవలు సృష్టించాలనో, అవగాహన లేమితోనో, రాజకీయ పరిజ్ఞానం లేక ఇలాంటి వ్యాఖ్యలు చేశారా? అని ప్రశ్నించారు. దార సుధీర్ తాను చేసిన వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కు తీసుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలను బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వీరిద్దరూ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సుధీర్‌లాంటి వ్యక్తి గెలిస్తే ఏ ఇతర కులాలు, మతాల ప్రజలను లెక్కచేయడన్న విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తించాలన్నారు. క్షమాపణ చెప్పకపోతే సుధీర్ ప్రచారాన్ని అట్టుకుంటామని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ స్వాములు హెచ్చరించారు. సుధీర్ ఇతర కులాలకు వారికి క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో నియోజకవర్గంలో కేవలం మాల సామాజిక వర్గం ఓట్లను మాత్రమే అడగాలని అన్నారు.

● మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టి ఓటు రాజకీయం చేసే ప్రయత్నం దార సుధీర్ చేస్తున్నారని, మానుకోవాలని బీఎస్పీ నాయకుడు లాజరస్ అన్నారు. విజ్జి, రాఘవ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'నీటి ఎద్దడి నివారణకు చర్యలు'



మల్యాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నందికొట్కూరు, మార్చి 12: పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మల్యాల రక్షిత మంచినీటి పథకం ప్రధాన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను కమిషనర్‌తో పాటు డీఈఈ నాయబ్ రసూల్, మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలకు మల్యాల పంప్ హౌస్ నుంచి మంచి నీటిని అందించడం జరుగుతుందన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య ఎదురుకాకుండా పక్కాగా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని స్వచ్ఛ నందికొట్కూరుగా తీర్చి దిద్దుతున్నామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

గడ్డివామి దగ్ధం

పాములపాడు, మార్చి 12: పాములపాడులో రైతు సుబ్బరావుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. మంగళవారం స్థానిక పెద్దబావి సందులోని కల్లంలో మధ్యాహ్నం గడ్డివామి వద్ద మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమయిన రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. సమయానికి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో దాదాపు లక్ష రూపాయల విలువ చేసే పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నందికొట్కూరు, మార్చి 12: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు డిపో మేనేజర్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు, పట్టణ ప్రజలకు ఆర్టీసీ ద్వారా కలుగుతున్న అసౌకర్యం, సమస్యలపై ఫోన్ ద్వారా సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు 9959225799 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలియజేయాలన్నారు.

చేయూత చెక్కు పంపిణీ

పాణ్యం, మార్చి 12: వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై చేయూత చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 2821 మంది సభ్యులకు నాలుగవ విడత కింద రూ.5.29 కోట్లు చెక్కును ఏపీఎం ప్రసాద్‌కు అందజేశారు. సర్పంచ్ పల్లవి, ఉప సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ సరళమ్మ, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, అధికారులు, చేయూత సభ్యులు పాల్గొన్నారు.

'సీఏఏను ఉపసంహరించుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 12: సీఏఏను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ సీఏఏ బిల్లును హడావిడిగా అమలుకు సిద్ధమవుతోందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో ముస్లిం మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగాను, ప్రజల హక్కులను హరించే ఇలాంటి బిల్లులను అందరూ వ్యతిరేకించాలని అన్నారు. దేశంలో సుప్రీం కోర్టు తీర్పుతో ఎలక్టోరల్ బాండ్లు, బహిర్గతం చేయాలని ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనను దృష్టి మళ్లించేందుకు మళ్లీ సీఏఏ బిల్లును తీసుకొని వచ్చారని ఆరోపించారు. కేరళ రాష్ట్రం తరహాలో ఏపీలో కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

ఎస్పీని కలిసిన ఏపీపీఎస్సీ బోర్డు సభ్యుడు

నంద్యాల క్రైం, మార్చి 12: ఇటీవలే ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన సిద్ధం శివరామ్ మంగళవారం ఎస్పీ కెరఘువీరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శివరామ్ వెంట శ్రీనివాసులు, పార్థుడు, ప్రసాద్, రవి తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నంద్యాల క్రైం, మార్చి 12: నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. టూ టౌన్ పోలీసుల వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన జమాల్‌బాషాకు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైంది. కోలుకున్న అనంతరం పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొంతకాలం నుంచి మానసిక స్థితి సరిగాలేకపోవడంతో ఈ నెల 4న కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతున్న జమాల్‌బాషా సోమవారం వార్డులోని బాత్రూంలోకి వెళ్లి రసాయన ద్రావణం తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లారు. విషయం గమనించిన భార్య వైద్యులకు చెప్పడంతో చికిత్స కొనసాగించారు. కోలుకోలేక జమాల్‌బాషా మృతిచెందారు. జమాల్‌బాషా భార్య జరీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటికుంటలో మొసలి కలకలం

ఆత్మకూరు, మార్చి 12: మండలంలోని వెంకటాపురం గ్రామ శివార్లలో గల ఇటుకల బట్టి నీటికుంటలో ఓ మొసలి సంచారం కలకలం రేపుతోంది. వివరాలివీ.. గ్రామంలోని శివారెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇటుకల బట్టీ నీటికుంటలో ఏడాది వయసు గల ఓ మొసలి సంచరిస్తున్నట్లు అక్కడ పనిచేసే వారు గమనించారు. ఒక్కసారిగా భయాందోళనకు గురై అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో నాగలూటి రేంజ్ అధికారి దొరస్వామి, వారి సిబ్బంది నీటికుంటను సందర్శించి మొసలి సంచారంపై ఆరా తీశారు. అసలే వేసవికాలం కావడంలో నీటికుంటలోని నీటిని తొలగిస్తే పశుపక్షాదులకు నీటికష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందని కేవలం మొసలిని బంధించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం మొసలి సంచార ప్రదేశాలను గుర్తించి అక్కడ ఓ బోనును ఏర్పాటు చేశారు. ఒకవేళ బోనులో మొసలిలో చిక్కుకున్నట్లుయితే దాన్ని బంధించి ఇతర సురక్షిత ప్రాంతాల్లో వదిలేయాలని అటవీ అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా ఇటుకల బట్టి నీటికుంట వద్దకు ప్రజలు, పాడిపశువులను వెళ్లనివ్వకుండా హెచ్చరికలు జారీ చేశారు. మొసలి బోనులోకి రాకపోతే త్వరలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని అటవీ అధికారులు చెప్పారు. కాగా చిన్నవయస్సులో మొసలిలో ఏదైనా వర్షపునీటిలో కొట్టుకొచ్చి కుంటలోకి వచ్చి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు, మార్చి 12: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆత్మకూరు రిటర్నింగు అధికారి సుధారాణి మంగళవారం తనిఖీ చేశారు. త్వరలో జరుగనున్న ఎన్నికలను పురస్కరించుకొని గుంతకందాల, బోయరేవుల, మోతుకూరు, తిమ్మనపల్లి, మాధవరం తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ నిర్వహించి వసతులపై ఆరా తీశారు. ఏర్పాట్లపై తగు సలహాలు సూచనలు తెలియ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, వెంకటరామిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

'ఆసరా నిధులు జమ చేయాలి'

గోస్పాడు, మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మహిళలకు ఆసరా పథకం కింద పొదుపు అకౌంట్‌లో జమ చేసిన నిధులు మహిళల అకౌంట్‌లో జమ చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మిదేవి డిమాండ్ చేశారు. మంగళవారం యాళ్ళూరు కెనరా బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసరా నిధులు చాలా రోజుల క్రిందటే పొదుపు అకౌంట్‌లో జమ అయ్యాయని, అయితే బ్యాంక్ అధికారులు పొదుపు మహిళల అకౌంట్‌లలో జమ చేయడానికి ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. పొదుపు మహిళలు ఇప్పటికే బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లించారని, కావున ఆసరా నిధులను వెంటనే మహిళల అకౌంట్‌లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రేపు జాబ్ మేళా

నంద్యాల (నూనెపల్లె), మార్చి 12: జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు గురువారం ఉదయం 9 గంటలకు నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగళూరు, చెన్నైలోని బహుళ జాతీయ కంపెనీ అయిన ఆల్‌సెక్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరుగుతుందని చెప్పారు. ఏదైనా బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీకాం, బీటెక్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. మూడు విభాగాలలో ఎంపికైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులు విద్యార్హత పత్రాలతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, డైరెక్టర్ జి.హేమంత్‌రెడ్డి, మేనేజర్ ప్రగతిరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి యూవీఎస్ కుమార్, కేఎస్ కుమార్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

కోవెలకుంట్ల, మార్చి 12: పట్టణంలోని సెబ్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు వేలం పాటలు 14న నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సెబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు నంద్యాల సెబ్ అధికారుల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు వేలం పాటలు కోవెలకుంట్ల సెబ్ స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్, పాన్‌కార్డుతో పాటు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చొన్నారు.

నిరుపేద కార్మికులకు వరం కార్మిక బీమా

కోవెలకుంట్ల, మార్చి 12: నిరుపేద కార్మికులకు బీసీజేఆర్ వెల్ఫేర్ బీమా పథకం వరం లాంటిదని మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, రేవనూరు టీడీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నిరుపేద కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.లక్ష, గాయాలు పాలైతే వారు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారికి రూ.20వేలు ఆర్థిక సాయం బీసీ జనార్దన్‌రెడ్డి బీసీజేఆర్ ట్రస్ట్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సాయం ఆలస్యమైనా బీసీ అందించే సాయం తక్షణమే అందుతుందని వారు తెలిపారు. వివిధ వృత్తి పనివారు తమ పేర్లను బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు కోరారు.

పోస్టల్ ఏజెంట్ మృతికి సంతాపం



సంటెన్న పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 12: పట్టణంలోని పింజరిపేటలో నివసించే పోస్టల్ ఏజెంట్ సంటెన్న గుండె పోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు బీసీ ఇందిరమ్మ మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. సంటెన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని బీసీ ఇందిరమ్మ తెలిపారు.

వీల్‌చైర్ పంపిణీ



వీల్ చైర్ పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మార్చి 12: పట్టణంలోని డ్రైవర్ సుబ్రహ్మణ్యంకు మూడు నెలల క్రితం పక్షపాతం రావడంతో ఇంటికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆయనను మంగళవారం పరామర్శించి వీల్ చైర్ అందించారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి అండగా ఉంటామని రాజారెడ్డి తెలిపారు.

అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్ట్ అమలు చేయాలి

● డోన్ న్యాయవాదుల డిమాండ్



డోన్‌లో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

డోన్(రూరల్), మార్చి 12: ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్టు అమలు చేయాలని డోన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డోన్ కోర్టు బార్ అసోసియేషన్ సమావేశ భవనంలో న్యాయవాది పులిదామోదర్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని న్యాయవాదులు నిరసన తెలియజేశారు. న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్న నేపథ్యంలో రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్టును అమలులోకి తెచ్చిందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా న్యాయవాదుల రక్షణను దృష్టిలో ఉంచుకుని అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్టును అమలు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు ఆలా మల్లికార్జున, మాధవకృష్ణారెడ్డి, అంజనేయులు గౌడు, ఎస్‌టీ హరూన్, జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి, గార్లపాటి మద్దిలేటి, రాగుల రాముడు, ఈశ్వర్, శివరామక్రిష్ణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తులపై దాడి.. 8 మందిపై కేసు నమోదు

శిరివెళ్ల, మార్చి 12 : శిరివెళ్ల మెట్ట సమీపంలోని బుడగజంగాల కాలనీకి చెందిన శిరిగిరి నడిపెన్న, కొమ్ములపల్లె పెద్ద గురుమూర్తి, జజన్న, వెంకటమ్మలపై అదే కాలనీకి చెందిన 8 మంది వ్యక్తులు ఈ నెల 9వ తేదీన గ్రామంలోని కటికె సెంటర్‌లో దాడి చేసి గాయపరిచినట్లు ఎస్‌ఐ సురేష్ మంగళవారం తెలిపారు. ఈ వ్యక్తులపై నిందితులు కర్రలతో దాడి చేశారని, క్షతగాత్రులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుడు శిరిగిరి నడిపెన్న ఫిర్యాదు మేరకు మోతె శంకర్, కప్పెర ప్రసాద్, మోతె మౌలాలి, యలవర్తి సంజీవ, పెద్దన్న, వెంకటస్వామి, గంగయ్య, చిన్న పెద్దన్నలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గ్రామాభివృద్ధికి కృషి

శిరివెళ్ల, మార్చి 12 : మండలంలోని మోత్కులపల్లె గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, గ్రామ సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు అన్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో దాదాపు రూ.12 లక్షల నిధులతో 250 మీటర్ల మేర సీసీ రహదారుల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను సక్రమంగా విడుదల చేసి ఉంటే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలూరి శివరామిరెడ్డి, నాగార్జునరెడ్డి, రఘునాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

డోన్(రూరల్), మార్చి 12: డోన్ పట్టణ సమీపంలోని రామచంద్ర మాలిక్‌బాబా ఆలయ సమీపంలో నిర్వహించిన అంతర్‌జిల్లాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, పోస్టు ప్రాద్, ఆర్‌ఈ రాజావర్ధన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. డోన్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన డా.గురునాథ్‌కు చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వృషభాల విజేతకు మొదటి బహుమతి కింద రూ.50వేల నగదును అందజేశారు. అలాగే కోడుమూరు మండలంకు చెందిన తిరుమలేశ్ వృషభాలు ద్వితీయ స్థానంలో నిలవగా.. రూ.40వేల నగదు, మూడో విజేతగా రూ.30వేల నగదును వృషభాల యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు ఫరీద్, ఉల్లిగడ్డల ప్రసాద్, వలి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోసపు హామీలతో ముంచేశారు

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

● టీడీపీలో చేరిన వెంకటనాయునిపల్లి వైసీపీ కార్యకర్తలు



కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వెంకటనాయునిపల్లి వైసీపీ కార్యకర్తలు

డోన్, మార్చి 12: గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోసపు హామీలిచ్చి ప్రజలను ముంచేశారని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి నివాసంలో కోట్ల సుజాతమ్మ, కోట్ల నివేదిత సమక్షంలో వెంకటనాయునిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వైసీపీ కార్యకర్తలు మాధవస్వామి, క్రిష్ణమూర్తి, రామక్రిష్ణ, నాగరాజు, శేఖర్, రామాంజనేయులు, సుంకన్న, పుల్లయ్య, బాలుతో పాటు మరో 40 మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎన్నో అభివృద్ధి పనులను చేయడం జరిగిందన్నారు. ఫ్లోరైడ్ నీటితో బాధపడుతున్న డోన్ పట్టణ ప్రజలకు రూ.52 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి శుద్ధజలం ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. డోన్‌ను మున్సిపాలిటీగా మార్పు చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పించామన్నారు. నియోజకవర్గంలో పేద విద్యార్థుల కోసం గురుకుల, మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశామన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. కోట్ల కుటుంబానికి డబ్బు లేకపోవచ్చు గానీ, ప్రజల ఆదరాభిమానాలే తమ బలమని అన్నారు. డోన్‌లో టీడీపీ జెండాను ఎగురవేసి తీరుతామని కోట్ల సుజాతమ్మ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, న్యాయవాది భాస్కర్ నాయుడు, చిట్యాల మద్దయ్యగౌడు, సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, ఓంప్రకాష్, చనుగొండ్ల శ్రీరాములు, మిద్దెపల్లి గోవిందు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీకి ఓటేయండి

అభివృద్ధి కోసం టీడీపీకి ఓటేయాలని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 20, 21వ వార్డులలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కోట్ల నివేదిత మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు మహిళల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించేవారన్నారు. వైసీపీ పాలనలో మహిళ సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి, మల్లిరమణ, కేఈ శ్యాం, దిలీప్ రెడ్డి, బాష్యం శ్రీధర్ గౌడు, మల్లి మణి, ఎల్ల గౌడు, చాటకొండ రజిని, ఎన్‌ఈ సరోజ, మాబు హుసేన్, అన్వర్, పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే బీసీలకు మంచి రోజులు

టీడీపీ నాయకుడు వై నాగేశ్వరరావు యాదవ్



మామిళ్లపల్లిలో బీసీ మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, మార్చి 12: టీడీపీ అధికారంలోకి వస్తేనే బీసీలకు మంచి రోజుల వస్తాయని ఆ పార్టీ బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ గతంలో బీసీల సంక్షేమం కోసం చంద్రబాబు అమలు చేసిన అనేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం బాధకరమన్నారు. దీంతో బీసీ కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం అమలు చేయడంతో పాటు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించడం, ఆదరణ పథకం పునరుద్ధరణ, విద్యార్థులకు వందశాతం ఫీజు రియింబర్స్‌మెంటు తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉంటూ వచ్చే ఎన్నికల్లో వైసీపీని తరిమి కొట్టాలని నాగేశ్వరరావుయాదవ్ పిలుపినిచ్చారు. అనంతరం ఇల్లుల్లు తిరిగి బీసీ మేనిఫెస్టో పత్రాలను నాయకులు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్రం రామక్రిష్ణ, గండికోట రామసుబ్బయ్య, కోదండరామయ్య, మహేష్, ఓబులేసు, మోహన్, మల్లికార్జున, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేస్తాం

● మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచులు



సమావేశంలో మాట్లాడుతున్న కేశవయ్యగౌడు, శేషఫణిగౌడు

డోన్, మార్చి 12: డోన్ నియోజకవర్గంలో టీడీపీ గెలిపించేందుకు కృషి చేస్తామని మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ టీఈ శేషఫణిగౌడు అన్నారు. మంగళవారం పట్టణంలోని వారు మాట్లాడుతూ డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. రెండు సార్లు సీఎం పదవి చేపట్టిన కోట్ల కుటుంబం ఎన్నో అభివృద్ధి పనులు చేసిందన్నారు. వైసీపీ నియంతృత్వ విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపునకు శక్తివంచన లేకుండా అందరం కలిసి కట్టుగా పని చేస్తామని కేశవయ్యగౌడు, శేషఫణిగౌడు ప్రకటించారు. సమావేశంలో నాయకులు మల్లి క్రిష్ణయ్య, టీఈ లక్ష్మన్నగౌడు, టీఈ శేఖర్‌గౌడు, టీఈ నాగరాజు గౌడు, న్యాయవాది ఎస్‌టీ హరూన్, ఈశ్వరయ్యగౌడు, రాము, గుండాల నారాయణ స్వామి పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక

బేతంచెర్ల, మార్చి 12: తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక అని టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో మంగళవారం క్లస్టర్-9 పరిధిలో ఎల్లనాగయ్య అధ్యక్షతన బీసీ డిక్లరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, టైలర్ రాముడు, చంద్రశేఖర్ యాదవ్, జనసేన నాయకులు చల్లా మద్దిలేటి, వెంకటేశ్వరగౌడు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

డోన్(రూరల్), మార్చి 12: పట్టణ సమీపంలోని రాఘవేంద్ర మాలిక్‌బాబా ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన స్వామి వారి రథోత్సవ కార్యక్రమం భక్తుల మధ్య కన్నుల పండువగా జరిగింది. మాలిక్‌బాబా ఆలయం నుంచి పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం వరకు రథాన్ని లాగారు. అంతకుముందు రామచంద్ర మాలిక్‌బాబా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆళ్లగడ్డ, మార్చి 12: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వెలుగు పాఠశాలలో బేటి బచావో- బేటి పడావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఫోక్స్ చట్టం, లింగవివక్షతలో స్త్రీ, పురుషులకు ఉన్న తేడాపై, ఆడపిల్లల చదువు, భద్రత, లైంగిక వేధింపులు వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

యాగంటి ఆదాయం రూ.14.46 లక్షలు

బనగానపల్లె, మార్చి 12: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం యాగంటి దేవస్థానానికి రూ.14.46 లక్షలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు. ఈనెల 7వతేదీ నుంచి 11వతేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలకు సుమారు 60వేల మంది భక్తులు యాగంటి ఉమామహేశ్వర స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. వివిధ సేవా టికెట్లు, లడ్డు ప్రసాదం, అమ్మకం, టోల్‌గేట్ వసూలు, భక్తుల విరాళాలు, హుండీ లెక్కింపు ద్వారా మొత్తం రూ.14.46లక్షలు ఆదాయం ఆలయానికి సమకూరినట్లు తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సహకరించిన భక్తులకు, వివిధ శాఖల అధికారులకు పోలీస్ సిబ్బంది, అన్నదాన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 12: మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలను ఎంఈవో అనూరాధ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నీటి కష్టాలు అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఎంఈవో పాఠశాలను సందర్శించి నీటి సమస్య గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నీటి సరఫరా కల్పించే ట్యాంకులను, కొళాయిలను పరిశీలించారు. విద్యార్థులకు నీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు.

లింగమయ్య స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 12 : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. అలాగే మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ, మార్చి 12: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో సహకరించాలని నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి కోరారు. అహోబిలం మఠంలో మంగళవారం బ్రహ్మోత్సవాలపై ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ప్రధానంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, మంచినీరు, పారిశుధ్యం, రవాణా, విడిది సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మద్యం, సారా వంటి వాటిని పూర్తిగా అరికట్టాలని, భక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు శాఖ అధికారులపై ఉందన్నారు. బ్రహ్మోత్సవాలు 16వ నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఈ 13 రోజులలో బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి శాఖ అధికారులపై ఉంటుందన్నారు. సమావేశంలో జీపీఏ సంపత్, ప్రత్యేక అధికారి శివప్రసాదరావు, డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంత నాయక్, వివిద ప్రభుత్వ శాఖల అధికాఋలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, మార్చి 12: చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల పరిశీలించారు. మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ బుక్కులు, రికార్డులను పరిశీలించారు. నాణ్యతగల భోజనం, కోడిగుడ్లు పంపిణీ చేయాలని అన్నా రు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మౌలాలి పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



చాగలమర్రి బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుశీల

చాగలమర్రి, మార్చి 12: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. మంగళవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో బేటి పడావో- బేటి బచావో కార్యక్రమంపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోరాదని అన్నారు. తల్లిదండ్రులు బాలికలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. బాలికల చదువుతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

గ్లాకోమాతో అంధత్వం



శిరివెళ్లలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

శిరివెళ్ల, మార్చి 12 : కంటి దృష్టిని క్రమంగా క్షీణింపజేసి అంధత్వం కలిగించే వ్యాధిని గ్లాకోమా అంటారని కంటి వైద్య అధికారి కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గ్లాకోమా వ్యాధి వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో శిరివెళ్లలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన 26 మందికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. దృష్టి లోపం తలెత్తకుండా ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూమా వర్గాన్ని చీల్చే వారి మాటలు నమ్మొద్దు



ఆళ్లగడ్డ పట్టణంలోని కందుకూరు రోడ్డులో గల శోభాఘాట్‌లో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ, విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, మార్చి 12: రెండు తెలుగు రాష్ట్రాలలో ఆళ్లగడ్డ భూమా వర్గం అంటే ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఈ వర్గాన్ని చీల్చేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని, అలాంటి వారి మాటలు నమ్మరాదని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కందుకూరు రోడ్డులో గల శోభాఘాట్‌లో దివంగత భూమానాగిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం శోభానాగిరెడ్డి సమాధుల వద్ద అఖిలప్రియ, బార్గవ్‌రామ్‌నాయుడు, భూమా విఖ్యాత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు చాగలమర్రి మండలంలోని కొలుములపేట, పెద్దవంగలి, మల్లెవేముల, డి.కొత్తపేట గ్రామాల్లోని 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో శిరివెళ్ల మండల టీడీపీ నాయకుడు కాటంరెడ్డి శ్రీకాంతరెడ్డి, చాగలమర్రి మండల టీడీపీ నాయకుడు అన్సర్‌బాషా, కౌన్సిలర్ హుసేన్‌బాషా, చాంద్‌బాషా, నాయకులు పుల్లయ్య, ఓబయ్య, హరిచంద్రారెడ్డి, వి.నరసింహారెడ్డి, విక్రమసింహారెడ్డి, రమణారెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

● దివంగత నేతలు భూమానాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలకు నంద్యాల మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మంగళవారం పూలమాలలు చేసి ఘనంగా నివాళులర్పించారు. భూమానాగిరెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకొని వారు ఆళ్లగడ్డ, నంద్యాల ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

చాగలమర్రి: దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి సేవలు మరువలేనివని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. మంగళవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో భూమా నాగిరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్, బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: దివంగత భూమానాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలకు ఆళ్లగడ్డ పట్టణంలోని శోభాఘాట్‌లో సినీనటుడు మంచు మనోజ్, భూమా మౌనిక మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సోషల్ మీడియాలో జాగ్రత్తగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రియతమ్ రెడ్డి

బేతంచెర్ల, మార్చి 12: ప్రజలు, యువత అందరూ సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయా పార్టీలకు చెందిన సోషల్ మీడియా సభ్యులతో పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన సోషల్ మీడియా ప్రతినిధులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎవరూ కూడా సోషల్ మీడియా (ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రామ్) వేదికగా వ్యక్తిగత దూషణలు, అసభ్యపదజాలాం, మతాలను , కులాలను వర్గాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయరాదని, ఫేక్ వార్తలను షేర్ చేయడం, పోస్టు చేయడం, పార్వార్డ్ చేయడం వంటి చేయకూడదన్నారు. ఇటువంటి వాటిపై గట్టి నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివశంకర్ నాయక్‌లు పోలీసు సిబ్బంది, ఆయా పార్టీలకు చెందిన సోషల్ మీడియా సభ్యులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించండి

సంజామల, మార్చి 12: మండల ప్రజలు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర కోరారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అల్వకొండ,కానాల,ఆర్ లింగందిన్నె,గ్రామాలలో ఎస్‌ఐ రమేష్ రెడ్డి కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో ముందస్తు గ్రామాలలో ఓటర్లు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటువేసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు



రేవనూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

కోవెలకుంట్ల, మార్చి 12: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని రేవనూరు, కోవెలకుంట్ల ఎస్‌ఐలు రామ్మోహన్‌రెడ్డి, వరప్రసాద్‌లు పేర్కొన్నారు. మంగళవారం రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలుగొట్ల, రేవనూరు గ్రామాల్లో కేంద్ర బలగాలైన సెంట్రల్ పోలీసులతో గ్రామాల్లో కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అందరు సహకరించాలన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 12: కొలిమిగుండ్ల మండలం తిమ్మానాయినిపేట గ్రామానికి చెందిన ఉప్పరకేశవ (51) అనే వ్యక్తి గుండెపోటుతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు ఉప్పర కేశవ మంగళవారం పసుపు తవ్వడానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుండెపోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదు



భూమా విఖ్యాత్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

చాగలమర్రి, మార్చి 12: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్-6 కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, గురుశేఖరరెడ్డి, నరేంద్రారెడ్డి, నర్సిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రాజు, నందీశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పాములేటి, గురునాథ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: రాష్ట్రంలో టీడీపీకి ఆదరణ పెరిగిందని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలం టి.లింగందిన్నె గ్రామానికి చెందిన మాజీ సొసైటీ చైర్మన్ గొడుగు నారాయణ, గొడుగు హరి, గొడుగు ఓబులపతి, వెంకటేశ్వర్లు, నారాయణ, లింగమయ్య బాల య్య, శివనాగేంద్రతో పాటు మరో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.